సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు మంగెన రాధాకృష్ణమూర్తి, అలివేలు మంగతాయారు దంపతులు (లక్కవరం) శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




మూడో అంతస్తు నుంచి కిందపడ్డ తల్లీబిడ్డలు

8లో

అన్నవరం దేవస్థానంలో సత్యగిరిపై విష్ణుసదన్ సత్రం మూడో అంతస్తు గోడ పైనుంచి అదుపు తప్పి తల్లి, కుమారుడు కింద పడి గాయపడ్డారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ పంటల సాగు అవసరాలకు కాటన్ బ్యారేజీ నుంచి డెల్టాల శనివారం 13,200 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర స్థాయి పదవులకు ఎంపిక చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు వెలువరించింది. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా గుర్రం గౌతమ్ (రాజమండ్రి సిటీ), నక్కా రాంబాబు (రాజానగరం), బంక అప్పారావు (గోపాలపురం), ఉప్పులూరి సత్యనారాయణ, సత్తి సుబ్బిరెడ్డి(రాజమండ్రి రూరల్)లను నియమించారు. ఆర్‌టీఐ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వల్లభశెట్టి గంగాధర్ శ్రీనివాస్ (కొవ్వూరు) నియమితులయ్యారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దేవస్థానానికి రూ.5.26 లక్షల ఆదాయం

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారంతో పాటు త్రయోదశి తిథి కలిసి రావడంతో భక్తులు అత్యధికంగా తరలివచ్చారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రాతఃకాల సమయంలో అర్చకులు, వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా రూ.2,61,750, ఆన్‌లైన్, క్యూఆర్ పరోక్ష పూజా టిక్కెట్ల ద్వారా రూ.2,46,400, అన్న ప్రసాదం విరాళాల రూపంలో రూ.18,047తో మొత్తం దేవస్థానానికి రూ.5,26,197 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. స్వామివారిని వ్యవసాయ శాఖ కమిషనర్ డి.హరిత దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకం జరిపించారు.

రేపటి నుంచి తపాలా వారోత్సవాలు



శేషారావు

రాజమహేంద్రవరం సిటీ: ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకూ జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం తపాలా డివిజన్ సూపరింటెండెంట్ కె.శేషారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకుని 6న సాంకేతిక దినోత్సవం, 7న పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా పాలసీలు, ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు సేవలపై అవగాహన కల్పించి, కొత్త ఖాతాలు ప్రారంభిస్తామని వివరించారు. అలాగే, 8న ఫిలాటలీ దినోత్సవం సందర్భంగా 'ఢాయీ అఖర్' శీర్షికన ఉత్తరాలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా 9వ తేదీన మాతృమూర్తి పేరున ఒక మొక్క అనే అంశంపై మొక్కలు నాటే కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 10వ తేదీన ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 8 నుంచి 14వ తేదీ వరకు ఆధార్ నమోదు, మార్పులకు డివిజన్ పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని శేషారావు పేర్కొన్నారు.

జల్ జీవన్ మిషన్‌పై రేపటి నుంచి శిక్షణ

సామర్లకోట: జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంపై 11 జిల్లాల్లోని ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈటీసీ ప్రిన్సిపాల్ కేఎన్‌వీ ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని 402 మందికి ఈ నెల 17 వరకూ బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తామని వివరించారు. ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు.

- చినబాబు సిఫారసులకు పెద్దపీట!

మీటర్ రీడింగ్‌కు టెండర్



- స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్ట్ కోసం కూటమి నేతల కుయుక్తులు
- నిబంధనలకు తిలోదకాలు
- యువగళం పాదయాత్ర చేసిన వారికి కట్టబెట్టేందుకు యత్నాలు
- అర్హత లేకపోయినా టెండర్‌లో పాల్గొనేందుకు గ్రీన్ సిగ్నల్
- మిగిలిన కాంట్రాక్టర్ల గగ్గోలు
- అనర్హత వేటు వేయాలని వినతి

సాక్షి, రాజమహేంద్రవరం: స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్ట్‌ను కొల్లగొట్టేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. ప్రస్తుత మంత్రి లోకేష్ వెంట గతంలో యువగళం పాదయాత్ర చేసిన నేతలకు ఈ కాంట్రాక్టు కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. చినబాబు సిఫార్సులకే పెద్దపీట వేస్తున్నారు. అనుకున్నదే తడవుగా టెండర్ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. అర్హత లేకపోయినా టెండర్లలో పాల్గొనేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. వాళ్లకే టెండర్ దక్కేలా లైన్ క్లియర్ చేస్తున్నారు. అనర్హులను టెండర్ల నుంచి తొలగించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో, అర్హులైన కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

ఇదీ సంగతి

జిల్లావ్యాప్తంగా సుమారు 7,82,170 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ సంస్థలవి 10,607, ప్రైవేటు కనెక్షన్లు 7,71,563 ఉన్నాయి. ప్రతి నెలా సుమారు 108.85 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. దీనికి గాను వినియోగదారులు ప్రతి నెలా సుమారు రూ.74.41 కోట్ల మేర విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 200 మందికి పైగా మీటర్ రీడర్లున్నారు.



విద్యుత్ బిల్లు తీస్తున్న మీటర్ రీడర్ (ఫైల్)

వీరు ప్రతి నెలా 1 నుంచి 11వ తేదీ లోపు మీటర్ రీడింగ్ తీస్తారు. ఒక్కో మీటర్ రీడింగ్‌కు విద్యుత్ శాఖ సంబంధిత కాంట్రాక్టర్‌కు పట్టణ ప్రాంతాల్లో రూ.6.16, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6.36 చొప్పున చెల్లిస్తోంది. ఈ మొత్తం సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు డిమాండ్ చేయడంతో పట్టణాల్లో 26 పైసలు, గ్రామాల్లో 75 పైసల చొప్పున పెంచారు. రీడింగ్ యంత్రం చార్జీలు, ఫోన్ రీచార్జ్, రీడింగ్ పేపర్ రోల్, మరమ్మతులు, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ మినహాయింపులు పోనూ ఒక్కో రీడర్‌కు ఒక్కో మీటర్‌కు రూ.3.10 మాత్రమే అందుతుంది.

'యువగళం' నేతలకు కట్టబెట్టేందుకు పావులు

విద్యుత్ పంపిణీ సంస్థలు కాంట్రాక్టు పద్ధతిలో స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టులు ఇస్తుంటాయి. కాంట్రాక్టర్‌కు గ్రామీణ, పట్టణ, ఏజెన్సీ కేటగిరీల వారీగా తీసిన బిల్లులకు కమీషన్ ఇస్తారు. ఇందులో భాగంగానే 2023-25లో నిర్ణయించిన ధరలతోనే ఈ ఏడాది సైతం టెండర్లు ఆహ్వానించారు. రాజమహేంద్రవరం సర్కిల్‌కు నగరంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయంలో టెండర్లు ఆహ్వానించారు. గత నెల 26 చివరి తేదీగా నిర్ణయించారు. ఇదే అదునుగా కూటమి నేతలు, చినబాబు అనుచరులు రంగంలోకి దిగారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో పాల్గొన్న నేతలు ఒక్కసారిగా వాలిపోయారు. అర్హతలు లేకపోయినా గుంటూరు, ఒంగోలు, విజయవాడకు చెందిన యువగళం టీడీపీ నేతలు టెండర్లు దాఖలు చేసేశారు. వాళ్లకు అర్హత లేదని తెలిసినా.. అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. దీని వెనుక లోకేష్ ఆదేశాలున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. టెండర్ల దాఖలు గడువు గత నెల 26నే ముగిసింది. ఆ రోజు వరకూ దాఖలైన టెండర్లను ఈపాటికే పరిశీలించాలి. అందరికంటే తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు టెండర్ కేటాయిస్తున్నట్లు ప్రకటించాలి. అనర్హులను డిస్‌క్వాలిఫై చేయాల్సి ఉన్నా.. నేటికీ ఆ ప్రక్రియ జరిగిన దాఖలాల్లేవు. కనీసం ఇప్పటి వరకూ టెండర్లు కూడా తెరవలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీని వెనుక వేరే మతలబు దాగి ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్ల కేటాయింపులో కాలయాపన చేసి యువగళం నేతలకు కట్టబెట్టేందుకు తెర వెనుక పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లోకేష్ అండదండలు

స్పాట్ బిల్లింగ్ టెండర్లలో నిబంధనలకు తిలోదకాలిచ్చినట్లు తెలిసింది. ఈ టెండర్‌లో పాల్గొనే కాంట్రాక్టర్‌కు క్లాస్–1 రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే టెండర్ దాఖలుకు అర్హత ఉంటుంది. సర్టిఫికెట్ లేకపోతే టెండర్ నుంచి డిస్‌క్వాలిఫై చేయాలి. గుంటూరు, విజయవాడ, ఒంగోలుకు చెందిన యువగళం సభ్యులకు అవేమీ లేవు. కానీ, లోకేష్ అండదండలు పుష్కలంగా ఉండటంతో టెండర్లు దాఖలు చేసేశారు. కనీసం డిస్‌క్వాలిఫై చేసేందుకు సైతం అధికారులు సాహసించడం లేదు. భీమవరంలో ఇలాంటి పరిస్థితి తలెత్తితే అక్కడి ఎస్‌ఈ వెంటనే డిస్‌క్వాలిఫై చేశారు. రాజమహేంద్రవరం సర్కిల్‌లో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. టెండర్ నుంచి తొలగిస్తే లోకేష్ నుంచి చివాట్లు తినాల్సి వస్తుందని అధికారులు వెనుకాడుతున్నట్లు తెలిసింది.

పాత కాంట్రాక్టర్లకు మంగళం!

స్పాట్ బిల్లింగ్ పాత కాంట్రాక్టర్లకు మంగళం పాడే దిశగా కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే పాత వారిని పక్కన పెట్టి యువగళం పాదయాత్ర నేతలకు కాంట్రాక్టును కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. సాంకేతిక అర్హతలు లేకపోయినా ఏదో ఒక విధంగా టెండర్ కేటాయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. క్లాస్–1 కాంట్రాక్టర్ సర్టిఫికెట్ లేని వారిని అనర్హులుగా ప్రకటించాలని కాంట్రాక్టర్లు గత నెలలో ఈపీడీసీఎల్ ఎస్‌ఈకి వినతిపత్రం ఇచ్చినా ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

నిబంధనల మేరకే..



స్పాట్ బిల్లింగ్ టెండర్ల కేటాయింపులో నిబంధనల మేరకే వ్యవహరిస్తాం. కాంట్రాక్టర్లు దాఖలు చేసిన టెండర్లను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే డిస్‌క్వాలిఫై చేస్తాం.

– తిలక్‌కుమార్, ఎస్‌ఈ, ఏపీ ఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం సర్కిల్

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వందలాదిగా భక్తుల రాక ప్రారంభమైంది. భక్తులు క్యూలో ఆలయ ప్రాంగణం చుట్టూ బారులు తీరారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామి, అమ్మవార్లను అర్చకులు విశేషంగా అలంకరించారు. స్వామివారికి వందలాది మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. దాతల ఆర్థిక సహాయంతో 9 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి శనివారం దాతల సహకారంతో భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలిపారు. స్వామివారి పుష్పాలంకరణ, ప్రసాదం, నిత్యగోత్రార్చన, అన్నదానం తదితర సేవలకు విరాళాలు స్వీకరిస్తున్నామన్నారు.

మరింత తగ్గిన గోదావరి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి మరింత తగ్గింది. బ్యారేజీ వద్ద నీటిమట్టం శనివారం రాత్రి 9.10 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 6,06,421 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఎగువన కాళేశ్వరంలో 9.03 మీటర్లు, పేరూరు 12.03, దుమ్ముగూడెం 9.43 మీటర్లు, భద్రాచలం వద్ద 32.60 అడుగులు, కూనవరంలో 15.53 మీటర్లు, కుంట 8.08, పోలవరం 10.51, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.09 మీటర్ల మేర నీటిమట్టాలు కొనసాగుతున్నాయి.

కడుపుకొట్టి.. బుజ్జగింపులా..?

- బెడిసికొట్టిన 'ఆటో డ్రైవర్ సేవలో..'
- ఉచిత బస్సు నేపథ్యంలో మొక్కుబడిగా పాల్గొన్న ఆటో డ్రైవర్లు
- పసుపు జెండాలతో ఫొటోలకు అంగీకరించని వైనం

సాక్షి, అమలాపురం/పి.గన్నవరం: ఓవైపు ఉచిత బస్సు పేరుతో తమ పొట్ట కొట్టారనే ఆగ్రహం.. దీనికి తోడు ఇస్తానన్న రూ.15 వేల సాయానికి నిబంధనల కొర్రీలు.. ఇలా గిల్లి జోల పాడినట్టుగా వ్యవహరిస్తున్న కూటమి సర్కారు తీరుపై ఆటో డ్రైవర్లు మండిపడ్డారు. టీడీపీ శనివారం నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో..' కార్యక్రమం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో రసాభాసగా మారింది. 'గోరంత సాయానికి.. కొండంత హడావుడి' అనే తీరులో ప్రచారార్భాటం చేయాలనుకున్న నేతల వ్యూహం బెడిసికొట్టింది. పలుచోట్ల ఆటో డ్రైవర్లు ఎదురు తిరిగారు. కూటమి సర్కారు తీరుపై అసంతృప్తితో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో టీడీపీకి చెందిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమక్షంలో టీడీపీ నేతలకు చేదు అనుభవం ఎదురైంది. ఆటో డ్రైవర్ల సేవలో ర్యాలీకి వంద ఆటోలు కూడా రాలేదు. వచ్చిన వారిలోనూ చాలా మంది కార్యక్రమంలో పాల్గొనకుండానే వెనుదిరిగారు. ఎమ్మెల్యే ఆనందరావు, ఇతర టీడీపీ నేతలు వచ్చిన సమయంలో కొంతమంది చోటామోటా నాయకులు ఆటోల ముందు టీడీపీ జెండాలతో ఫొటోలు దిగేందుకు సిద్ధమయ్యారు. దీనికి ఆటో డ్రైవర్లు అభ్యంతరం చెప్పడంతో తమ్ముళ్లు కంగుతిన్నారు.

టీడీపీ, జనసేన బాహాబాహీ

నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలో టీడీపీ, జనసేన నేతలు బాహాబాహీకి దిగారు. ఒకరినొకరు నెట్టుకోవడంతో పాటు, పరుష పదజాలంతో తిట్ల దండకం అందుకున్నారు. ఇక్కడ నిర్వహించిన ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం కోసం రవాణా శాఖ తయారు చేసిన ఫ్లెక్సీపై, ఆటో డ్రైవర్లకు పంపిణీ చేసే నమూనా చెక్కుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో లేకపోవడంతో జనసేన నేతలు విరుచుకుపడ్డారు. జనసేనకు చెందిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమక్షంలోనే అధికారులపై మండిపడ్డారు. పవన్ వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. తాము నిర్వహించే కార్యక్రమాల్లో చంద్రబాబు ఫొటో వేస్తున్నామని, టీడీపీ కార్యక్రమాల్లో మాత్రం పవన్ కల్యాణ్ ఫొటో వేయడం లేదని ప్రశ్నించారు. అధికారులు సర్ది చెబుతున్న సమయంలో టీడీపీకి చెందిన మద్దాల సుబ్రహ్మణేశ్వరరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో జనసేన నేతలు మండిపడ్డారు. సుబ్రహ్మణ్యేశ్వరరావుతో పాటు మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, ఇతర టీడీపీ నాయకుల పైకి దూసుకుపోయారు. ఈ క్రమంలో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగజేసుకుని ఇరు పార్టీల నాయకులకు సర్ది చెప్పారు.



పి.గన్నవరం మండలం పోతవరంలో టీడీపీ, జనసేన కార్యకర్తల జరిగిన మధ్య వాగ్వాదం

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ప్రపంచానికి మేలు

పెరవలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రపంచ వ్యాప్తంగా అమలు చేస్తే మానవాళికి మేలు జరుగుతుందని బ్రెజిల్ బృంద నాయకుడు వాల్టర్ లింక్ అన్నారు. బ్రెజిల్, యుఏఈ, శ్రీలంకకు చెందిన 27 మంది నిపుణులతో కూడిన బృందం పెరవలి మండలం ముక్కామలలో శనివారం పర్యటించింది. ప్రకృతి వ్యవసాయం, వినూత్న పద్ధతులు, రైతు సాధికారతపై బృంద సభ్యులు పరిశీలించారు. ప్రకృతి సాగు ఏవిధంగా గిట్టుబాటు అవుతుంది, ఆదాయం వంటి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ముక్కామలలో ప్రదర్శించిన 9 సూత్రాల చక్రాన్ని సందర్శించారు. జీవామృతం, కోడిగుడ్డు – నిమ్మరసం ద్రావణం తయారీ, వినియోగం, నిల్వ పద్ధతులపై అవగాహన పొందారు. సాగు విధానాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరిలో కలుపు నివారణ పద్ధతులు, కూలీల ఖర్చు తగ్గింపు తదితర సమాచారం రైతుల నుంచి సేకరించారు. వేసవిలో వేసిన నవధాన్యాల వలన పంట భూములకు కలిగే ప్రయోజనం, తక్కువ నీటి వినియోగంతో సాగు గురించి అవగాహన చేసుకున్నారు. డ్రోన్ ద్వారా కషాయాల పిచికారీని, బ్రిక్స్ రీడింగ్ ద్వారా పంట ఆరోగ్యం కొలిచే విధానాన్ని వీక్షించారు. ఆయిల్‌పామ్, వక్క, అరటి సాగు నమూనాలు పరిశీలించి, మార్కెట్లో ఉన్న డిమాండ్ గురించి అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయంలో వారి పాత్ర గురించి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం షేక్ మహబూబ్ వలీ, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ, మోడల్ మండల్ టీమ్ లీడర్ బసవన్నగౌడ్, వ్యవసాయాధికారి మేరీ కిరణ్, ఏపీఎం బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముక్కామలలో అరటి, వక్క, పామాయిల్ పంటలను పరిశీలిస్తున్న బ్రెజిల్ బృందం

తొలి తిరుపతికి భక్తుల రద్దీ

పెద్దాపురం (సామర్లకోట): పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనేక మంది భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారి దర్శించుకున్నట్లు ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,49,570, అన్నదాన విరాళాలు రూ.51,217, కేశఖండన ద్వారా రూ.7,480, తులాభారం ద్వారా రూ.700, ప్రసాదం విక్రయాలకు రూ.18,600 కలిపి మొత్తం రూ.2,27,627 ఆదాయం సమకూరిందని వివరించారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అర్హులైన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఆటో డ్రైవర్లకు నమూనా చెక్ అందజేశారు. కంబాల చెరువు నుంచి సభా స్థలి వరకూ స్వయంగా ఆటో నడిపారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 11,915 మంది ఆటో రిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు రూ.17.87 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. అర్హత ఉండి ఎవరికైనా ఆర్థిక సాయం అందకపోతే అధికారుల దృష్టికి తీసుకుని రావాలని, సమస్య పరిష్కరించి లబ్ధి చేకూరేలా చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు నమూనా చెక్‌ను అందజేస్తున్న మంత్రి రామానాయుడు తదితరులు

నిత్య కల్యాణమూర్తీ.. గోవిందా..

- వాడపల్లి క్షేత్రంలో భక్తజన ప్రవాహం
- ఒక్క రోజులో దేవస్థానానికి రూ.53.41 లక్షల ఆదాయం

కొత్తపేట: గోవింద నామస్మరణతో కోనసీమ తిరుమల క్షేత్రం మార్మోగింది. నిత్య కల్యాణమూర్తీ.. గోవిందా.. శ్రీనివాసా... శ్రీ పురుషోత్తమా.. అంటూ వాడపల్లి వాసుని స్మరిస్తూ భక్తులు తన్మయులయ్యారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి క్షేత్రం శనివారం అశేష భక్తజనంతో కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కోర్కెలు తీరిన అనేక మంది భక్తులు స్వామివారి దర్శనానికి కాలినడకన చేరుకున్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు పూజాదికాలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. శ్రీవేంకటేశ్వర సహిత ఐశ్వర్యలక్ష్మీ హోమం నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశారు. వేలాది మంది భక్తులతో లైన్లు నిండిపోయాయి. స్వామి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఉచిత వైద్య శిబిరాల్లో పలువురు భక్తులకు వైద్య సేవలందించారు. ఉచిత వాహనాల్లో వృద్ధులు, దివ్యాంగులను, గర్భిణులను చేరవేశారు. విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం, ఆన్‌లైన్, నిత్య, శాశ్వత అన్నదాన విరాళాలు, లడ్డూ విక్రయం తదితర రూపాల్లో దేవస్థానానికి సాయంత్రం 7 గంటల సమయానికి రూ.53,41,146 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్సై ఎస్ రాము వాడపల్లిలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలను పర్యవేక్షించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



వాడపల్లి క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆలమూరు: జాతీయ రహదారిలో మూలస్థాన అగ్రహారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, రావులపాలెం మండలంలోని ఊబలంక శివారు తోకలంకకు చెందిన గుత్తుల విజయరాజు (30) తన తండ్రితో కలిసి నర్సరీలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని శుక్రవారం అర్ధరాత్రి ఇంటికి వెళుతుండగా, స్థానిక వంతెన సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో విజయరాజుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా గుర్తించిన పోలీసులు ఆ మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, అక్కడ మార్చురీలో ఉంచారు. దీనిపై శనివారం జరిపిన విచారణలో మృతుడు విజయరాజుగా పోలీసులు నిర్ధారించారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ పాత్రికేయుడు అప్పారావు కన్నుమూత



అమలాపురం రూరల్: సీనియర్ పాత్రికేయులు అడపా అప్పారావు(73) శనివారం అమలాపురంలో కన్నుమూశారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు ఆయన కుంటుబ సభ్యులు తెలిపారు. ముమ్మిడివరం కేంద్రంగా పాత్రికేయుడిగా పాత్రికేయ వృత్తిలోకి వచ్చిన ఆయన సుమారు 50 ఏళ్లు జర్నలిస్టుగా కాకినాడ, రాజమండ్రి కేంద్రాల్లో వివిధ పత్రికల్లో, టీవీ ఛానళ్లలో పని చేశారు. అమలాపురం మండలం రోళ్లపాలెంలో నివసిస్తున్న ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఉమ్మడి ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా జర్నలిస్టుల సమస్యలపై ఉద్యమాలు చేశారు. ఆయన మృతికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వాతిప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే కోనసీమ జిల్లా అధ్యక్షుడు మండెల బాబి, రాజమండ్రి జిల్లా అధ్యక్షుడు మండెల శ్రీరామమూర్తి, ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి సుంకర ప్రసాద్, ఐజేయూ సభ్యుడు పరస సుబ్బారావు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మాలధారణం.. నియమాల తోరణం

- గ్రామగ్రామానా అయ్యప్ప స్వామి భక్తుల మండల దీక్ష ప్రారంభం
- కఠిన నియమాలతో నిర్వహణ
- 14న ఇరుముడులతో శబరిమల పయనం
- స్వాములకు ఉచిత భిక్ష


కొత్తపేట మండలం వాడపాలెం ఆలయంలో భిక్ష స్వీకరిస్తున్న స్వాములు


ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయం

కొత్తపేట: పవిత్రమైన అయ్యప్ప స్వామి దీక్షకు 'మాల ధారణం.. నియమాల తోరణం' అంటూ భక్తులు శ్రీకారం చుట్టారు. పలుచోట్ల భక్తులు శుక్రవారం మాల ధరించి దీక్షలు ప్రారంభించగా, మరికొన్ని చోట్ల ఆదివారం మాల ధరించనున్నారు. ఎక్కువగా అయ్యప్ప స్వామి దీక్షలు దసరా రోజుల్లో లేదా విజయ దశమి అనంతరం ప్రారంభిస్తారు. దీనిని మండల దీక్ష అంటారు. 41 రోజుల అనంతరం దీక్ష ముగించి, ఇరుముడులతో శబరిమలకు పయనమవుతారు. అలాగే కార్తికమాసంలో కూడా అనేక మంది దీక్షను ప్రారంభిస్తారు. దీనిని జ్యోతి దర్శన దీక్ష అంటారు. మకర సంక్రాంతికి ముందు దీక్షను ముగించి జ్యోతి దర్శనానికి వెళతారు. 41 రోజుల పాటు కఠిన నియమాలతో దీక్షను ఆచరిస్తారు.

అయ్యప్ప మాలధారణ నియమాలు

మాల ధారణ అనేది అయ్యప్పను దర్శించడానికి భక్తులు చేపట్టే కఠినమైన 41 రోజుల వ్రత దీక్ష. ఈ దీక్షలో భక్తులు పవిత్రత, బ్రహ్మచర్యం, శాఖాహారం మాత్రమే తీసుకునే కఠినమైన నియమాలను పాటిస్తూ, రుద్రాక్ష లేదా, తులసి, స్ఫటిక పూసలతో చేసిన మాలలు, నల్లని లేదా నీలం దుస్తులు ధరిస్తారు. చెప్పులు లేకుండా నడవడం, రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా నదీ స్నానం లేదా చల్లటి నీటితో స్నానం చేయడం, కటిక నేలపై నిద్రించడం వంటి నియమాలు పాటిస్తారు. ఈ దీక్ష సమయంలో దైనందిన జీవితానికి, భౌతిక సుఖాలకు దూరంగా, కఠిన నియమాలు పాటించడం ద్వారా, భగవంతునిపై భక్తిని, అంకిత భావాన్ని, క్రమశిక్షణతో ఆధ్యాత్మిక సాధన చేస్తూ.. అయ్యప్పస్వామిని దర్శించడానికి తమను తాము మానసికంగా, శారీరకంగా సిద్ధం చేసుకోవడమే వ్రత దీక్ష ముఖ్యోద్దేశం.

జిల్లాలో అయ్యప్ప ఆలయాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు ప్రతి నియోజకవర్గంలో అయ్యప్పస్వామి ఆలయాలున్నాయి. ద్వారపూడిలో అయ్యప్పస్వామి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. దీనిని ఆంధ్ర శబరిమలగా పిలుస్తారు. కొత్తపేట మండలం వాడపాలెం అయ్యప్ప స్వామి – జ్ఞాన సరస్వతీదేవి ఆలయం కోనసీమ శబరిమలగా విరాజిల్లుతోంది. రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ సమీపాన, కాకినాడ, సామర్లకోట, తుని, అమలాపురం, మండపేట, కొత్తపేట, వాడపాలెం, ముమ్మిడివరం, రామచంద్రపురం, రాజోలు, అనపర్తి, కత్తిపూడి తదితర ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి ఆలయాలున్నాయి. ఏటా భక్తులు ఆయా ఆలయాల్లో గురుస్వాముల చేతుల మీదుగా మాలను ధరించి, దీక్ష ప్రారంభిస్తారు. కొత్తపేట మండలం వాడపాలెం అయ్యప్ప స్వామి – జ్ఞాన సరస్వతీదేవి ఆలయం వద్ద ఏకాదశి సందర్భంగా శుక్రవారం సుమారు 130 మంది అయ్యప్ప మాల ధరించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 30 వేల మంది భక్తులు మాల ధరిస్తారని అంచనా. 41 రోజుల అయ్యప్ప దీక్ష అనంతరం గురుస్వాముల చేతుల మీదుగానే ఇరుముడులు కట్టించుకుని శబరిమల పయనమవుతారు. శబరిమల వెళ్లలేని భక్తులు ద్వారపూడి వెళ్లి దీక్షను ముగిస్తారు.

స్వాములకు సుభిక్ష

కఠినమైన అయ్యప్ప దీక్షలో మాల ధరించింది మొదలు, దీక్ష పూర్తయ్యే వరకూ ఏకభుక్తం (ఒక్క పూట భోజనం) మాత్రమే చేయాలి. ఇంట్లో అన్ని రోజులూ నియమాలతో ఆహారం తయారుచేయడం కుదరదు. చాలా మంది భక్తులు బృందంగా ఏర్పడి స్వయంగా వండుకుంటారు. అలా కుదరని వారు ప్రత్యేకంగా మడిగా ఉండే వంట మనుషులతో ఉదయం, రాత్రి వడి (అల్పాహారం), మధ్యాహ్నం భిక్ష (భోజనం) చేయించుకుని స్వీకరిస్తారు. మరికొందరు స్వామిపై భక్తితో మాల ధరిస్తారు. వారికి మడిగా వడి, భిక్ష తయారుచేసుకునే అవకాశం ఉండదు. ఉద్యోగ, ఉపాధి, వివిధ పనులపై దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అటువంటి వారు భిక్ష లేక ఆ పూట ఉపవాసం ఉండాల్సిన పరిస్థితి. అటువంటి వారి కోసం వడి, భిక్ష దాదాపు అన్ని అయ్యప్ప ఆలయాల్లో అందిస్తున్నారు.

వాడపాలెంలో ఉచిత భిక్ష ప్రారంభం

కొత్తపేట మండలం వాడపాలెం అయ్యప్ప స్వామి – జ్ఞాన సరస్వతీదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అయ్యప్ప మాలధారులకు ఉచిత భిక్ష (అన్న ప్రసాదం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాతలు కూడా ఇందుకు సహకరిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం భిక్ష ప్రారంభించారు. తొలిరోజు సుమారు 150 మంది భిక్ష స్వీకరించారు. కొత్తపేట బోడిపాలెం వద్ద గౌతమి అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి భిక్షను ప్రారంభించనున్నారు. సుమారు 250 మంది భక్తులు భిక్ష స్వీకరిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం..



అయ్యప్ప స్వామి మాలధారణ, దీక్ష, నియమాలు పాటించడం ద్వారా ఆధ్యాత్మిక తత్వం పెరగడంతో పాటు, సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయి. సూర్యోదయానికి ముందే నిద్ర లేవడం వల్ల చైతన్యం, చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థ ఉత్తేజపర్చడం, నేలపై పడుకోవడం వల్ల అనారోగ్య సమస్యల పరిష్కారం, చెడు వ్యసనాలు దూరమవుతాయి. కులం, పేద, ధనిక తారతమ్యం లేకుండా దీక్ష చేయడం వల్ల స్నేహభావం పెరుగుతుంది.

– దొంతికుర్తి రామచంద్రశర్మ, గురుస్వామి, ప్రధాన అర్చకుడు, అయ్యప్ప స్వామి – జ్ఞాన సరస్వతీదేవి ఆలయం, వాడపాలెం

అదృష్టంగా భావిస్తున్నాం



ఆలయ కమిటీ ద్వారా మండల దీక్ష చేపట్టిన సాటి అయ్యప్ప మాలధారులకు ఉచిత అన్న ప్రసాదం (భిక్ష) వండి వడ్డించే కార్యక్రమం ఏటా నిరాటంకంగా సాగుతోంది. స్థానిక మాలధారులకే కాక, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే స్వాములకు అన్నప్రసాదం అందించడం అదృష్టంగా భావిస్తున్నాం.

– మట్టా బాబ్జి, గురుస్వామి, కన్వీనర్, అయ్యప్ప స్వామి – జ్ఞాన సరస్వతీదేవి ఆలయ కమిటీ, వాడపాలెం

దాతల సహకారం



మాలధారులకు ఉచిత భిక్ష గొప్ప బృహత్తర కార్యక్రమం. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాముల సహకారంతో ఉచిత భిక్షకు శ్రీకారం చుట్టాం. తర్వాత దాతల సహకారం తోడైంది. కార్యక్రమానికి సహకరిస్తున్న అయ్యప్ప భక్తులు, దాతలందరూ అభినందనీయులు.

– దేశంశెట్టి శ్రీనివాస్, సభ్యుడు, గౌతమి అయ్యప్పస్వామి ఆలయ కమిటీ, కొత్తపేట

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల నిర్వహణ

ఏపీ వాలీబాల్ కోచ్ ముదునూరి



రామకృష్ణంరాజును సత్కరిస్తున్న స్థానికులు, అర్చకులు

కొత్తపేట: యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణకు కృషి చేస్తున్నట్టు ఏపీ వాలీబాల్ కోచ్ ముదునూరి చలపతి రామకృష్ణంరాజు తెలిపారు. ఆత్రేయపురం మండలం తాడిపూడి గ్రామానికి చెందిన రామకృష్ణంరాజు ప్రస్తుతం హైదరాబాద్‌లో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. తన స్వగ్రామం తాడిపూడి వచ్చిన ఆయన శనివారం వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు వేదమంత్రోచ్ఛరణతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు విలేకరులతో మాట్లాడుతూ, గ్రామీణ క్రీడలైన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి వాటిలో యువత రాణించాలన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, ఆరోగ్యంతో పాటు, మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. స్పోర్ట్స్‌మన్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఇటీవల డీఎస్సీలో 900 మంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారని, వీరిలో వాలీబాల్ క్రీడాకారులు 50 మంది ఉన్నారని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి ఓసారి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ల నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. తద్వారా యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతుందన్నారు.

మూడో అంతస్తు నుంచి కిందపడ్డ తల్లీబిడ్డలు

- తల్లికి తీవ్ర గాయాలు
- స్వల్ప గాయాలతో బిడ్డ సురక్షితం
- సత్యగిరిపై విష్ణుసదన్‌లో ఘటన


గాయపడిన శ్యామల సింధును అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది


ప్రమాదం జరిగిన విష్ణుసదన్ సత్రం


తల్లి, కుమారుడు కిందపడడంతో వంగిపోయిన సన్‌షేడ్

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్యగిరిపై ఉన్న విష్ణుసదన్ సత్రం మూడో అంతస్తు గోడ పైనుంచి అదుపుతప్పి తల్లి, కుమారుడు కిందపడ్డారు. ఈ ఘటనలో తల్లికి రెండు కాళ్లు విరిగిపోగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, శుక్రవారం రాత్రి విష్ణుసదన్ సత్రంలోని మూడో అంతస్తులో 27, 28 నంబర్ హాళ్లలో జరిగిన వివాహానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన శ్యామల సింధు తన మూడేళ్ల కుమారుడు శ్యాకేత్‌రామ్‌తో కలిసి వచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో శ్యామల సింధు తన కుమారుడు శ్యాకేత్ రామ్‌కు 28 హాలు ఎదురుగా పిట్టగోడపై కూర్చోబెట్టి అన్నం తినిపిస్తోంది. కుమారుడు హఠాత్తుగా వెనక్కు పడిపోతుండడంతో ఆమె గట్టిగా పట్టుకుంది. ఈ క్రమంలో ఇద్దరూ అదుపుతప్పి కింద మట్టిలో పడిపోయారు. కుమారుడిని గట్టిగా పట్టుకోవడంతో ముందు తల్లి పడగా, ఆమెపై కుమారుడు పడ్డాడు. నేరుగా నేలపై పడకుండా, రెండో అంతస్తు కిటికీ సన్‌షేడ్‌పై పడి.. అక్కడి నుంచి కిందపడ్డారు. ఈ ధాటికి సన్‌షేడ్ విరిగిపోయింది. ఈ ఘటనలో శ్యామల సింధు బలంగా నేలను తాకడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. ఆమెపై ఉన్న కారణంగా కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. పెళ్లి బృందాల వారు వెంటనే 108కు ఫోన్ చేయగా, సిగ్నల్స్ లేకపోవడంతో హరిహర సదన్ సత్రం నుంచి సమాచారం అందించారు. గంట తర్వాత అంబులెన్స్ చేరింది. క్షతగాత్రులను కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తొండంగి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

భక్తుల ఆగ్రహం

రత్నగిరిపై సత్రాలు, పెళ్లిళ్ల సీజన్‌లో మండపాలు కేటాయించి దేవస్థానం అధికారులు చేతులు దులుపుకొంటున్నారని, తర్వాత వారిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విష్ణుసదన్‌లో 36 హాళ్లు ఉన్నాయి. కొందరు రెండు హాళ్లు తీసుకుని పెళ్లిళ్లతో పాటు, భోజనాలూ అక్కడే ఏర్పాటు చేసుకుంటారు. రాత్రయితే అక్కడ అంతా అయోమయం. విద్యుత్ సరఫరా నిలిచిపోతే.. పునరుద్ధరణకు చాలా సమయం పడుతుంది. గతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడే పెళ్లికి హాజరైన మహిళ మెడలో బంగారు గొలుసును దుండగుడు అపహరించాడు. అక్కడ పోలీసులే కాదు.. కనీసం ప్రైవేట్ సెక్యూరిటీ ఉండడం లేదనే విమర్శ ఉంది. అక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా ఉండవు. ఎటువంటి సంఘటనలు జరిగినా పోలీసులకు, దేవస్థానం అధికారులకు కానీ వెంటనే సమాచారం ఇచ్చే పరిస్థితి లేదు. ఆయా సమస్యలను దేవస్థానం అధికారులు చక్కదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ డైరెక్ట్ 10th, Inter (వయసు 18) డిగ్రీ (All), PG (All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమా, B.Tech, M.Tech,DBM, ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS. ✆ 81431 00455, 73969 95332 [G-285]

ADMISSIONS
■ Join B.Sc Ai / CSc over 60%, Maths in 10+2 get 5000 fee discount. Join M.Com / MA English / MSW by 6/10/2025, 3000 fee discount. ✆ 9177408565 [SCA25008618]

Real Estate

FLAT FOR SALE
■ RJY విద్యుత్‌నగర్, 4వ వీధి, Mani Residency, 1550 SFT గల 3 B/R, E/F, 1st Floor ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ : 99891 79361 [R-7761]

■ ఫ్లాట్ అమ్మకం. రాజమండ్రి ఏ.వి. అప్పారావు రోడ్, మహాలక్ష్మి టెంపుల్ వీధి, ఆక్సిజన్ టవర్స్, 1590Sft మొబైల్ 9490736691. [HA-16168]

TO-LET
■ రాజమండ్రి బాలాజీ పేట సెంటర్, కోటక్ మహీంద్ర బ్యాంక్ ప్రక్కన, వెస్ట్ ఫేసింగ్, 1900 SFT, ఫస్ట్ ఫ్లోర్ Commercial Space ఫ్లాట్ అద్దెకు కలదు. కార్ పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యం కూడా కలదు. సంప్రదించండి Cell : 76007 39709, 97273 37777. [SCA25008151]

HOUSE FOR SALE
■ రాజానగరం నియోజకవర్గం కోరుకొండ గ్రామం, బొండాడ వారి వీధి లో 270 చ॥గ॥ స్థలంలో ఉన్న పెంకుటిల్లుతో సహా స్థలం అమ్మబడును ✆ : 94932 89456, 99851 56495 [SCA25008471]

PLOT FOR SALE
■ కాకినాడ పోర్టు దారిలో 100అ ఎడిబి రోడ్డు మీద 1345 చ.గ. స్థలం అమ్మకం– 9347073899 [WB-23624]

■ కాకినాడ యానాం NH-16 హైవే రోడ్డు చేర్చి జి.వేమవరం GS. గార్డెన్లో DTCP అప్రూవల్ కలిగిన చుట్టూ మూడు వైపులా రోడ్లు కలిగియున్న 1825 చ॥గ॥ స్థలం అమ్మకం కలదు. ✆ : 96668 63917, 99491 73915 [R-1171]

■ కాకినాడ రూరల్, పిఠాపురం దగ్గర గల చిత్రాడ నుండి చంద్రంపాలెం వెళ్లే రోడ్డు పక్కన ప్లాట్లు మరియు కాకినాడ దగ్గర గల వాకలపూడి శ్రీనివాస్‌నగర్‌లో 300 గజాలు & కాకినాడ ADB రోడ్ దగ్గరలో అచ్చంపేట గ్రామం నుండి గొంచాల మీదుగా సామర్లకోట వెళ్లే రోడ్డులో రోడ్డు పక్కన ప్లాట్లు అమ్మకమునకు కలవు. ఫోన్ : 94921 23355 [V- 2869]

Services

■ బంగారం బ్యాంక్స్ & ప్రైవేట్ ఫైనాన్స్‌లో తనఖాలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, 100% జెన్యూన్ ✆ : 92908 44844 [R-7760]

Wanted

■ కాకినాడ ఇంట్లో ఉండి ఇంటిపని వంటపని చేయుటకు 40 సం॥ల లోపు ఆడ పని మనిషి కావలెను ✆ : 0884-2362015, 93908 07320 [SCA25008708]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 7993583999 [HA-16185]

■ వాంటెడ్ పురుషులు కావలెను. Age: 20 to 50 yrs, గుడ్ శాలరీ / 8 hr. డ్యూటీ+ ESIC+PF+ 4 W/o's ఫ్రీ జాబ్స్ నో ఫీజ్ ఆధార్‌కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్. బొమ్మిడి వరప్రసాద్, ఈస్ట్‌గోదావరి 9100028528, 7396128206 [G-408]

■ వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం: రూ.15,000/- + డైలీ రూ.100/-, (వివాహమైన స్థానిక అభ్యర్థులు మాత్రమే) శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 94909 98888 [R-92]

■ రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 73829 73264, 99087 69888 [B-1280518]

WANTED TEACHERS
■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్,నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మేన్స్, సెక్యూరిటీ గార్డ్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391036931 [HA-16191]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
రీజనల్ సెంటర్లు :
రాజమండ్రి : 99516 02906, 90101 20345
రాజానగరం : 97057 54205, అనపర్తి, మండపేట : 99516 02941
రామచంద్రపురం : 99516 02936
కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం : 98499 62678
తుని, జగ్గంపేట : 90109 67896, అమలాపురం : 97053 47414
రాజోలు , పి.గన్నవరం : 97053 46456
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010

కెనరా బ్యాంకు నూతన శాఖలు ప్రారంభం



చాగల్లు, నల్లజర్లలో కెనరా బ్యాంకు నూతన శాఖలను ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

చాగల్లు/నల్లజర్ల: రెండు చోట్ల కెనరా బ్యాంకు నూతన శాఖలను బ్యాంక్ విజయవాడ జనరల్ మేనేజర్ సీజీ విజయలక్ష్మి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. చాగల్లు, నల్లజర్ల బస్టాండ్ వద్ద ఆయా శాఖలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు, వ్యాపారులతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కెనరా బ్యాంకు లక్ష్యమన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.మాధవరావు మాట్లాడుతూ, డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు సహా, అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బంగారం తాకట్టు, పంట, ముద్ర రుణాలు అందిస్తామన్నారు. బ్రాంచ్ మేనేజర్లు ప్రవీణ తోట, సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సినీ నటి శ్రీరెడ్డికి నోటీసు

రాజమహేంద్రవరం రూరల్: ఐటీ యాక్ట్ కింద నమోదైన కేసులో సినీ నటి మల్లిడి శ్రీరెడ్డికి 35 బీఎన్ఎస్ నోటీసును బొమ్మూరు ఎస్సై రమేష్ శనివారం జారీ చేశారు. గతేడాది నవంబర్ 12న టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరెడ్డిపై ఐటీ యాక్ట్ కింద బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళ్తున్న శ్రీరెడ్డికి లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఎస్సై రమేష్, మహిళా కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌తో వెళ్లి నోటీసు అందజేశారు.

స్కూల్స్ గేమ్స్ ఉమ్మడి జిల్లా ఎంపికలు రేపు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): నగరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్స్ గేమ్స్ ఎంపికలు నిర్వహించనున్నట్టు డీఈవో కె.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుట్‌బాల్ అండర్-14 బాలురు, బాలికలు, కరాటే అండర్-14, 17 బాలురు, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆయా క్రీడాంశాల్లో పాల్గొనే వారు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఏవీడీ ప్రసాదరావు 98853 10089 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రపంచ బాడ్మింటన్ పోటీలకు న్యాయ నిర్ణేతగా సాయిబాబు



తొండంగి: వరల్డ్ జూనియర్ బాడ్మింటన్ చాంపియన్ షిప్‌కు న్యాయనిర్ణేతగా మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు, కోచ్ సువర్ణం సాయిబాబు ఎంపికయ్యారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అసోం రాష్ట్రం గౌహతిలో ఈ నెల ఆరు నుంచి 19 వరకు జరగనున్న ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా నియమిస్తూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) నుంచి ఉత్తర్వులు అందాయని చెప్పారు. ఈ పోటీలకు సుమారు 46 దేశాలకు చెందిన క్రీడాకారులు హాజరవుతారన్నారు. ఎంపికైన సాయిబాబుకు ఏపీ, తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శులు అంకమ్మచౌదరి, బాలసుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు.

చమురు సంస్థలతో నిరుద్యోగ భృతి ఇప్పించాలి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్



అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాగూ నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, కనీసం కోనసీమ నుంచి రూ.కోట్ల విలువైన నిక్షేపాలను తరలించుకుపోతున్న చమురు సంస్థల నుంచి ఈ ప్రాంత యువతకు నిరుద్యోగ భృతి ఇప్పించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. దాదాపు 40 ఏళ్లుగా కోనసీమలో చమురు సంస్థలు రూ.కోట్ల లాభాలు ఆర్జిస్తున్నా, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కోనసీమ నేల నుంచి తవ్వుతున్న నిక్షేపాలతో చమురు సంస్థలు రూ.వేల కోట్లతో వ్యాపారాలు చేస్తున్నా.. చంద్రబాబు ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయా సంస్థలను ఉపయోగించుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. దాదాపు రూ.50 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి చమురు సంస్థల నుంచి రాయల్టీ రూపంలో రావాల్సి ఉండగా, ప్రధాని మోదీకి భయపడి చంద్రబాబు ప్రశ్నించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పైపెచ్చు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల రాష్ట్రానికి నాలుగు పెద్ద యూనివర్శిటీలు ప్రపంచ దేశాల నుంచి తెచ్చానని ఘనంగా చెబుతున్నారన్నారు. జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్‌లో ఎప్పుడో విదేశీ యూనివర్శిటీలకు కార్పొరేట్ రంగంలో డబ్బు వసూలు చేసుకోవచ్చంటూ ఆయన చట్టం తెచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రానికి మంజూరైన పెట్రోలియం యూనివర్శిటీ ఉత్తరప్రదేశ్‌కు తరలిపోతున్నా ఉలుకూ పలుకు లేకుండా ఉండిపోయారని దుయ్యబట్టారు. చంద్రబాబు మాటలను నమ్మే స్థితిలో నిరుద్యోగులు లేరన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకుడు ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు

ఉమ్మడి జిల్లా పరిధిలో 600 మంది హాజరు


అండర్-14 తైక్వాండో ఎంపికను ప్రారంభిస్తున్న బంగార్రాజు


బాలికల సైక్లింగ్ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో శనివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి పోటీలకు వివిధ క్రీడాంశాల్లో జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలను సీనియర్ పీడీలు రవిరాజు, బంగార్రాజు, పట్టాభిరామం, మాజీ ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి జార్జి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శులు కె.శ్రీనివాస్, సుధారాణి ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో సుమారు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సైక్లింగ్, తైక్వాండో, రెజ్లింగ్, స్క్వాష్, పెంటాథలాన్‌లో జరిగిన ఎంపికలకు తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, డీఎస్ఏ రెజ్లింగ్ కోచ్ కనకదుర్గ, డీఎస్ఏ స్క్వాష్ కోచ్ లక్ష్మణ్ సాంకేతిక అధికారులుగా వ్యవహరించారు. కాకినాడ రాజా ట్యాంక్ ఆవరణలోని వైఎస్సార్ మున్సిపల్ స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్ ఎంపికలను ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి సుధారాణి ప్రారంభించారు.